శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## ద్వార దర్శనం చేసుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, జనవరి 10, ప్రభాత వార్త–వైద్యం** ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల లో శ్రీ వెంకటేశ్వరస్వామిని, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, మాజీ శాసనమండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ద్వార దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

## షాదీఖానా, బరియల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తా

### అబ్దుల్ అజీజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్



**నెల్లూరు,జనవరి10,ప్రభాతవార్త– వైద్యం** విజయవాడనగరంలోని విద్యాధరపు రంలో గల షాదీఖానా, బరియల్ గ్రౌండ్‌ను ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, వక్ఫ్‌బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాదర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్యాధర పుర ప్రాంతంలో గల ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకుగల సాధ్య అసాధ్యాలను పరిశీలించామన్నారు. విద్యాధరపురంలోని ఎనిటీఎస్ నెంబర్ 128లో గల 6.90 ఎకరాలలో 3 సెంట్ల భూమిని ముస్లిమ్ స్మశాన వాటికకు కేటాయించి ఉందన్నారు. మిగతా భూమి 3 ఎకరాల 90 సెంట్స్ భూమిని అభివృద్ధి కోసం వినియోగించాలని గెజిట్లో నమోదు చేయబడిందన్నారు. ఈ స్థలాన్ని అభివృద్ధి పరిచే విషయంలో తగు నిర్ణయాన్ని తీసుకోవడమే కాకుండా త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, జనవరి 10, ప్రభాతవార్త** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని కుటుంబసభ్యులతో దర్శించుకున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. కలియుగ ప్రత్యక్షదైవం ఆ శ్రీనివాసుని మంగళకరమైన దీవెనలు కందుకూరు నియోజకవర్గం ప్రజలందరికి కలగాలని కోరుకున్నారు.

## కార్పొరేషన్ లో వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 10,ప్రభాత వార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలను శుక్రవారం నిర్వహించారు. సంబరాల్లో ముఖ్య అతిధిలుగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్, కమిషనర్ సూర్యతేజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని రకాల సంప్రదాయక ఏర్పాట్లతో నెల్లూరు నగరపాలక సంస్థ ప్రాంగణంలో సంక్రాంతి వైభవం ఉట్టిపడుతోందని తెలిపారు. ముఖ్యంగా భవిష్యత్ తరాల వారికి మన సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, మన పండుగలు గుర్తుండేలా ప్రతి ఏటా నగరపాలక సంస్థ కార్యాలయంలో అద్భుతమైన అలంకరణలను ఏర్పాటుచేసి, పండుగను అత్యంత శోభితంగా అధికారులు, సిబ్బంది అందరితో కలిసి నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేసారు. మన పిల్లలకు సంక్రాంతి భోగి కనుమ పండుగల విశిష్టతను తెలియజేసి పండుగలో భాగమైన భోగిమంటలు, గొబ్బెమ్మలకుపూజలు,కోలాట్కప్రదర్శనలు, రంగవల్లుల అలంకరణలు,హరిదాసు వేషధారణ, సాంప్రదాయ దుస్తులు వంటి వాటి ని పరిచయం చేస్తూ తర్వాతి తరాలకు పండుగను తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమనిమేయర్ వెల్లడించారు.సంబరాల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, గంగిరెద్దుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యాలయ ప్రాంగణంలో భోగిమంటలను మేయర్ కమిషనర్ వెలిగించారు. డిజే పాటలకు సిబ్బంది చేసిన నృత్యాల్లో మేయర్, కమిషనర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో నగర పాలక సంస్థ అన్ని విభాగాల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న వీబీఆర్



**నెల్లూరు,జనవరి 10, ప్రభాతవార్త–వైద్యం** నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న శ్రీ సీతారామస్వామి వారిని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ప్రతాపరెడ్డి, దేవస్థానం నిర్వాహకులు, ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేమిరెడ్డి గోత్రనామాలతో అర్చ క స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడు తూ ముక్కోటి ఏకాదవిని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నగర ప్రజలు స్వామివారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం అర్చక స్వాములు తీర్థ ప్రసాద వినియోగాలు అందించే వేదమంత్రాలతో ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, 16వ వార్డు నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, 13వ నాయకులు ఊటుకూరు చంద్ర, 15వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి,మద్దినేని శ్రీనివాసులురావు, మాజీ కార్పొరేటర్‌భాషు, పావురాల రమేష్, శ్రీనివాస్ చౌదరి, శీలం, కమ్మ కళ్యాణి, కాయల తిరుపతి, బారు అశ్విన్, కేవిడి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 31 వరకు నూతన కళాశాలల ఏర్పాటు

### ధరఖాస్తుల స్వీకరణ



**నెల్లూరు,జనవరి10 ప్రభాతవార్త–విద్య** జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేయదలచిన ప్రయివేట్ జూనియర్ కళాశాలల ధరఖాస్తులను ఈనెల 31వ తేదీ వరకు స్వీకరించటం జరుగుతుందని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. గతంలో అవకాశం ఫిబ్రవరి 28 తేదీ వరకు ఉందని, కానీ బోర్డు ఉన్నతాధికారులు దీనిని జనవరి 31వకు తగ్గించటం జరిగిందన్నారు. అలాగే కళాశాలల అఫిలియేషన్ రెన్యువల్, అడిషనల సెక్షన్స్, కోరు ్సలు, షిఫ్టింగ్,మేనేజ్‌మెంట్ కోర్సులు, కాలేజీ పునఃప్రారంభం, వంటి వాటికి మాత్రం ఫిబ్రవరి 28వరకు గడువు ఉందన్నారు. అందరూ దీనిని గమించాలని కోరారు. ఈనెల 11నుండి 19వరకు జిల్లాలోని అన్నీ జూనియర్ కళాశాలలకు సంక్రాతి సెలవులను ప్రకటించటం జరిగిందని సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించకూదన్నారు. అలా కాదని నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే 2025 మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హజరైయ్యే విద్యార్థుల నామినల్ రోల్స్‌ను కళాశాలల లాగిన్‌లో ఉంచటం జరిగిందని, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ ఆయా వివరాలను సరిచూసుకోవాలని కోరారు.

## వైభవంగా ముక్కోటి ద్వార దర్శన వేడుకలు



**కోవూరు, జనవరి 10 ప్రభాతవార్త** :కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ద్వార దర్శన వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకు లు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే స్వామివారి ద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆళ్ల కృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి , తదితరులు ఉన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి10, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 1931క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ ్యం 78టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 71.097 టిఎంసిల నీరునిల్వఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 2050, కండలేరు వరదకాలువకు200 క్యూసెక్కులు వంతున నీటినివిడుదల చేస్తున్నారు. ప్రస్తు తం 99.636 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు

# భక్తుల మరణం బాధాకరం : మంత్రి ఆనం

- రూ.2లక్షల కోట్ల పనులకు శ్రీకారం
- రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా
- స్వల్పగాయాలైన వారికి రూ.2లక్షలు
- ప్రమాదకరమైన గాయాలైన వారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా
- అధికారుల వైఫల్యం



**నెల్లూరు, జనవరి 10, ప్రభాతవార్త–వైద్యం** తిరుమలలో జరిగే ముక్కోటి ఏకాదశి వైకుంఠ ద్వారా దర్శనాల కోసం తిరుపతి క్యూలైన్‌లో జరి గిన తోపులాటలో కొంతమంది భక్తులు మరణించ డం చాలా బాధారమని రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని సంతపేటలో ఉన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో కలిసి ప్రధాని నరేంద్రమోడీ సుమారు రూ. 2లక్షల కోట్ల పై చిలుకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకొస్తుందనే ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో తిరుపతిలో ఈదుర్ఘటన జరగడం దురదృష్టకరమని, అందరి హృదయాల్ని కలిచి వేసిందన్నారు. సీఎం పర్యటనలో ఉన్న దేవాలయ ధర్మాదాయశాఖ మంత్రిగానేను,హోంమంత్రి అనిత, రెవెన్యూశాఖ సత్యప్రసాద్ మంత్రులను తిరుపతికి చేరుకోమని ఆదేశాలతో గురువారం తిరుపతికి చేరుకుని జరిగిన పరిస్థితులపై చర్యలు చేపట్టి, క్షతగాత్రులను పరామర్శించడం జరిగిందన్నారు. చనిపోయిన వారికి పంచనామ చేసి వారి కుటుంబ సభ్యులతో ఒక రెవెన్యూ అధికారులతో ప్రత్యేక వాహనాలలో వారి వారి స్వస్థలాలకు చేర్చడం జరిగిందన్నారు. మరణించిన వారిలో ముగ్గురు విశాఖపట్నం అనకాపల్లి ప్రాంతానికి చెందిన వారు, ఒకరు కర్నూలు జిల్లా, ఒకరు కేళ, ఒకరు తమిళనాడు అని ఆయన వెల్లడించారు. క్యూలైన్లలో ఉన్న ఒక మహిళకు షుగరు తగ్గడంతో ఆమె స్పృహ కోల్పోతున్న తరుణంలో ఆమెను అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చే ప్రయత్నంలో గేటు తీసే తరుణంలో, లోకల్లో ఇస్తున్నారని ఆలోచనలతో భక్తులు తొక్కిసలాట జరిగిందని క్షతగాత్రులు తెలియజేశారన్నారు. మేము అక్కడ అంతా పరిశీలించే సమయానికి ముఖ్యమంత్రి కూడా ఘటన స్థలానికి చేరుకున్నాడన్నాడు. ఘటనా స్థలంలో అధికారుల వైఫల్యం కూడా ఉందని, డీఎస్పీ హోదా కలిగిన అధికారి ఆ సమయానికి అక్కడ లేకపోవడం అనేక ఆలోచనలకు తావిస్తోందన్నారు. టీటీడీ జేఈఓ కూడా టోకెన్ క్యూలల్ల విషయంలో అవగాహన రాహిత్యం తేటతెల్లం అవుతుందన్నారు.ఒక ఐఏఎస్ అధికారి అయ్యుండి తన విధులను సక్రమంగా నిర్వర్తించలేక పోయాడని ఆరోపించాడు. 9 కౌంటర్లు 90 సెంటర్లు ఏర్పాటు చేశారని, తిరుపతిలో ఎప్పుడు కూడా అలాగ కౌంటర్లను ఏర్పాటు చేయలేదని, భక్తులు నేరుగా తిరుమలకు వెళ్లి అక్కడ కౌంటర్లలో టోకెన్ తీసుకొని, ఎంత సమయం అయినా వేచి ఉండి దర్శనానికి వెళ్లేవారు అన్నారు. చంద్రబాబునాయుడు క్యూలైన్ల పర్యవేక్షణ అధికారులను ఎందుకు ఏర్పాటు చేయాలని నిలదీయడం జరిగిందన్నారు. క్షతగాత్రులకు ప్రస్తుతం స్విమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 35 మంది క్షతగాత్రులను వారి ఆరోగ్య పరిస్థితులను చంద్రబాబు నాయుడు వ్యక్తిగతంగా తెలుసుకున్నాడన్నారు. మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందించిందన్నారు. వైద్యశాఖ మంత్రి సత్యప్రసాద్, హోంమంత్రి అనిత, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు ఐసీయూలోకి ఇతరులను పంపించలేదన్నారు. ఆసుపత్రుల్లో నియమనిబంధనలు ప్రకారం తాము వ్యవహారించామన్నారు. గంటన్నరసేపు ముఖ్యమంత్రి ఆసుపత్రిలో రోగుల స్థితిగతులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడేందుకు ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వమేనని ఆనం ధ్వజమెత్తారు.

# ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లు



**నెల్లూరు, జనవరి 10,ప్రభాతవార్త – కలెక్టరేట్:** శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు గురించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పెరేడ్ గ్రౌండ్స్ భద్రత కు ప్రాధాన్యమిచ్చి పోలీస్ శాఖ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే శకటాలను అందంగా, విజ్ఞానదాయకంగా తయారుచేసి ప్రదర్శించాలన్నారు. అలాగే వేడుకలకు హాజరయ్యే ప్రముఖులకు అల్పాహారం, ఇతర అవసరాలను గుర్తించి అందించాలన్నారు. పోలీస్, సాయుధ దళాలు, ఎన్ సి సి సంయుక్తంగా కృషి చేసి కవాతు ప్రదర్శనలివ్వాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకునే విధంగా నిర్వహించేందుకు విద్యార్థులకు తగిన తర్ఫీదునివ్వాలన్నారు. ఉద్యో గులకు అందించే మెరిట్ సర్టిఫికెట్లకు తగు ప్రతిపాదనలను నిర్ణీత సమయంలోగా పంపాలన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, డిఆర్ఓ ఉదయ భాస్కర్ రావు,ఆర్డిఓ అనూష,డిఇవో ఆర్.బాలాజీ రావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి , డి ఆర్ డి ఏ, హౌసింగ్, ఏపీఎంఐపి పీడీలు నాగరాజ కుమారి, వేణుగోపాల్, శ్రీనివాసులు, డిటిసిచందర్,డిపివో శ్రీధర్‌రెడ్డి,డి సిఓ గురప్ప, ఇరిగేషన్, ఆర్అండ్ బి, ఆర్డ బ్ల్యూ ఎస్, ఎస్.ఇలు దేశ్‌నాయక్,గంగాధర్, వరప్రసాద్, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# సుందరయ్య నగర్ కాలనీ మంచి నీటి కష్టాలను తీర్చిన ఎమ్మెల్యే



**కందుకూరు, జనవరి 10, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని 6వ వార్డు సుందరయ్య నగర్ కాలనీలో మంచినీటి పబ్లిక్ కుళాయిలు ప్రారంభించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. గత దశాబ్ద కాలంగా సుందయ్య నగర్‌లో ఉన్న మంచినీటి సమస్యకు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం చూపలేదని, కానీ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా సుందయ్య నగర్‌కు వచ్చిన ఇంటూరి నాగేశ్వరరావుకి స్థానిక ప్రజలు సమస్యలుచెప్పుకోగా అధికారంలోకి రాగానే మీ సమస్యకు పరిష్కారం చూపిస్తానని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక వాటర్ పైప్ లైన్ ద్వారా పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని అందజేసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు సుందరయ్య నగర మహిళలు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుందరయ్య నగర్ లో అన్ని మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని, వర్షాకాలంలో కాలనీ నీటి ముంపుకు గురి కాకుండా ప్రత్యేక స్ట్రోమ్ వాటర్ డ్రైన్ ద్వారా నీటి మరలించి కాలనీ ముప్పుకు గురి కాకుండా చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షులు అహ్మద్ భాషా, మున్సిపల్ కమీషనర్ కే.అనూష, మున్సిపల్ డీఈ గణపతి, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, షేక్ మున్నా, షేక్ ఫిరోజ్, షేక్ రూబీ, షేక్ సలాం, ముచ్చు శ్రీను, గడ్డం మాలకొండయ్య, చుండూరి శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# దేవుని చల్లనిచూపు కావలి నియోజకవర్గ ప్రజలపై ఉండాలి

## వివిధ ఆలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, జనవరి 10 ప్రభాతవార్త** దేవుని చల్లనిచూపు కావలి నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వెంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి ఆయన కుమార్తె సంహితరెడ్డి, అల్లుడు బినీత్‌రెడ్డిలతో కలిసి వివిధ ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలమధ్య ఎమ్మెల్యే దగుమాటి కూతురు, అల్లుడుకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముక్కోటి ఏకాదశి విశిష్ఠతను తెలియచేశారు.

**కావలి బృందావనం వెంకటేశ్వరస్వామి** కావలి పట్టణం బృందావనం హౌసింగ్‌కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే దగుమాటి, ఆయన కూతురు సంహితరెడ్డి, అల్లుడు బినీత్‌రెడ్డిలు దర్శించుకున్నారు. ఈ కాలనీలో హౌసింగ్‌కాలనీ వ్యవస్థాపక అద్యక్షుడు శ్రీరాంమాల్యాద్రి, కార్యదర్శి గాదంశెట్టి వెంకటేశ్వర్లు (జివి), ఉపాధ్యక్షుడు రాజా రమణయ్య, మోడల్‌స్టోర్స్ నరసింహారావు, కమిటి సభ్యులు స్వాగతంపలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంక్షేమసంఘం అద్యక్షుడు, ప్రముఖ హోమియోవైద్యులు డాక్టర్ వింతా కృష్ణారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కు మార్‌యాదవ్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

**కావలి విష్ణాలయంలో** కావలి పట్టణ శ్రీలక్ష్మీకాంత స్వామి (విష్ణాలయం) ఆలయంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి, కూతురు సంహితరెడ్డి, అల్లుడు బినీత్‌రెడ్డి విష్ణుమూర్తిని దర్శించుకున్నారు. ఈ ఆలయ అనువంశిక వంశపారంపర్య అర్చకులు నారాయణం రామాచార్యులు వేద ఆశీర్వచనాలు వారికి అందచేశారు.

**కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో** బోగోలు మండలం కొండబిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే దగుమాటి, ఆయన కూతురు సంహితరెడ్డి, అల్లుడు బినీత్‌రెడ్డిలు దర్శించుకున్నారు. కమిటి సభ్యులు ఘనస్వాగతంపలికారు. ఈ మూడు ఆలయాల్లో తీర్థప్రసాదాలు స్వీకరించారు. దుశ్శాలువాలతో, పూల మాలలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ మూడు ఆలయాల్లో భక్తులను ఎమ్మెల్యే దగు మాటి ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సచివాలయాల పరిధిలో రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయండి: కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 10, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాలలో ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి పన్ను వసూళ్లను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. స్థానిక 7వ డివిజన్ నందు అరుణాచలం వారి వీధి, రైతు బజార్, జయప్రకాశ్ వీధి సచివాలయాల పరిధిలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అనధికారికంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. డివైడర్లకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఇతర నిర్మాణాలకు అవసరమైన రంగులు వేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. స్థానిక తడికల బజారు కూడలిలోని అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించారు ఈ సందర్భంగా క్యాంటీన్లో అందుతున్న అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. రోడ్ల పక్కన శిధిలమైన స్థితిలో వదిలేసి ఉన్న వాహనాలను, నిరుపయోగంగా పడి ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత డిపార్ట్మెంట్ వారికి తెలియజేసి వెంటనే అక్కడి నుంచి తొలగించాల్సిందిగా కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. స్థానిక రైతు బజార్ ను సందర్శించి ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ పనితీరు, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి, ఇతర అంశాలను నిర్వాహకులు, దుకాణదారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పంపింగ్ స్టేషన్ పనితీరును కమిషనర్ పరిశీలించారు. వాటర్ ట్యాంక్ లోని వాటర్ లెవెల్, క్లీనింగ్ డేట్ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు. డివిజన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.

**కాలువలను ఆక్రమించి కట్టినభవనాలను గుర్తించండి** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని స్థానికంగా ఉన్న పంట కాలువను ఆక్రమిస్తూ జరిగిన భవన నిర్మాణాన్ని గుర్తించిన కమిషనర్ వార్డు ప్లానింగ్ గత కార్యదర్శికి, అనధికార ఫ్లెక్సీల తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున వార్డు ప్లానింగ్ ప్రస్తుత కార్యదర్శికి, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున వార్డు అడ్మిన్ సెక్రటరీకి షోకాజు నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ మాల్యాద్రి, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. చైతన్య, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

